ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
బుధవారం 4 సెప్టెంబరు 2024



ఘనంగా బడగ పండుగ 7లో..

గంజాయికి దూరంగా ఉండండి : సీపీ 7లో..



పంచాయతీలకు నిధుల కొరత

- నిధులు విడుదల చేయని ప్రభుత్వాలు
- ఆరు నెలలుగా విడుదలకాని నిధులు
- సర్దుబాటు చేసేందుకు నానా తంటాలు
- ఇబ్బందులు పడుతున్న కార్యదర్శులు

మంచిర్యాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలను నిధుల కొరత వేధిస్తోంది. పారిశుధ్యం నిర్వహణ, ఇతర అభివృద్ధి పనులు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కొన్ని నెలలుగా గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల నిలిచిపోవడంతో ఖజానా ఖాళీగా దర్శనమిస్తోంది. ఓ వైపు ట్రాక్టర్ల నెలవారీ కిస్తీలు పేరుకుపోతుండగా, మరోవైపు కార్మికులకు వేతనాలు లేక ఇబ్బందులు తప్పడంలేదు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. దాదాపు ఆరు నెలలుగా నిధులు మంజూరు కావడంలేదు. మేజర్ పంచాయతీలు మినహా చిన్న పంచాయతీల్లో పాలన కార్యదర్శులకు భారంగా మారుతోంది. పారిశుధ్యం, తాగునీటి అవసరాలకు డబ్బులు సర్దుబాటు చేస్తున్నా.. నెలల తరబడి బిల్లులు విడుదల కాకపోవడంతో వారు కూడా చేతులెత్తేసే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాలో నిధుల లేక నిర్వహణ భారమై పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవులు పెట్టారు. జిల్లాలోని కార్యదర్శులు సైతం అదేబాటలో పయనించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రత్యేకాధికారులు వారంలో ఒకసారి కూడా పంచాయతీలను దర్శించడం లేదని, బాధ్యత మొత్తం తమపైనే పడుతోందని కార్యదర్శులు వాపోతున్నారు.

● బిల్లులు రాక తప్పని ఇబ్బందులు...

ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీన సర్పంచుల పదవీకాలం ముగిసింది. సాధారణంగా పంచాయతీల్లో పన్నులను మార్చి నెలాఖరులో వసూలు చేస్తారు. పాలకవర్గాల పదవీ కాలం ముగుస్తుండడతో మెజార్టీ గ్రామాల్లో ముందుగానే పన్నులు వసూలు చేశారు. ఇలా సమకూరిన సొమ్మును పంచాయతీ అవసరాల కోసం వెచ్చించిన సామగ్రికి బిల్లులు పెట్టి సర్పంచ్‌లు డబ్బులు తీసుకున్నారు. మరికొందరి బిల్లులు ఇంకా పెండింగ్‌లోనే ఉండడంతో సంబంధిత అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

● జేబుల్లో నుంచి కార్మికులకు వేతనాలు....

చిన్న పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు మూడు, నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడంలేదు. నీటి సరఫరా, పారిశుధ్య కార్మికులు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో కార్యదర్శులు జేబుల నుంచి వేతనాలు చెల్లించాల్సి వస్తోంది. వీధి దీపాల బిల్లుల చెల్లింపు, తాగునీటి పథకాల నిర్వహణ, విద్యుత్ మోటార్ల మరమ్మతు వంటి అత్యవసర పనులకు కార్యదర్శులు సర్దుబాటు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఒక్కో గ్రామ పంచాయతీలో రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు, మేజర్ గ్రామ పంచాయతీలైతే రూ.5 లక్షల వరకు వివిధ పనుల నిమిత్తం కార్యదర్శులు ఖర్చు చేసినట్లు చెబుతున్నారు.

రావాల్సినవి రూ.6 కోట్ల పైచిలుకు....

జిల్లాలో 311 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతీ నెలా సుమారు రూ.6 కోట్ల వరకు నిధులు విడుదల కావలసి ఉంది. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులను (ఎస్‌ఎఫ్‌సీ) ప్రభుత్వం ప్రతీనెలా, కేంద్రానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు (ఎఫ్‌ఎఫ్‌సీ) ప్రతీ మూడు నెలలకోసారి విడుదల చేయాల్సి ఉంది. అయితే ఆరు నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయడంలేదు.

● కంటి తుడుపు చర్యగా నిధులు విడుదల...

పంచాయతీల్లో అభివృద్ధి దాదాపుగా పడకేసే పరిస్థితికి చేరడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంటి తుడుపు చర్యగా నిధులు విడుదల చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టులో రూ.6 కోట్లు విడుదల చేయగా, కేంద్రం గత సెప్టెంబరులో రూ.4 కోట్లు విడుదల చేసింది. విడుదలైన నిధులు పంచాయతీల్లో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించేందుకే సరిపోయా యి. కార్యదర్శులు వెచ్చించిన మొత్తం ఇంకా పెండింగులోనే ఉన్నాయి. వివిధ పనుల నిమిత్తం ఇప్పటి వరకు వెచ్చించిన డబ్బులు రాకపోగా, మళ్లీ కొత్తగా ఎక్కడి నుంచి తెచ్చేదని కార్యదర్శులు వాపోతున్నారు.

సంచార గ్రంథాలయం ప్రదర్శన

చెన్నూరు, సెప్టెంబరు 3: రూమ్ టూ రీడ్ ఆధ్వర్యంలో మండలంలోని ఎల్లక్కపేట గ్రామంలో మంగళవారం సంచార గ్రంథాలయాన్ని ప్రదర్శించారు. ప్రజల్లో, విద్యార్థుల్లో చదవడానికి ఆసక్తిని పెంపొందించడానికి దోహదపడుతుంది. ఈ గ్రంథాలయంలో కథల పుస్తకాలను ప్రదర్శించారు. ఎల్‌ఎఫ్‌బీ రాఘవులు, సీఆర్‌పీలు రాజ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, రాజ్‌నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చెన్నూరు, సెప్టెంబరు 3: కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న కామర్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులు బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పట్వర్థన్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టు పీజీలో 55 శాతం మార్కులు ఉండాలని, బుధవారం చివరి తేదీ అని తెలిపారు. గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 7989890221, 7997055562లో సంప్రదించాలన్నారు.

గురుకులాన్ని పరిశీలించిన ఎంపీడీవో

మందమర్రిరూరల్, సెప్టెంబరు 3: మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల పాఠశాలను మంగళవారం ఎంపీడీవో రాజేందర్ పరిశీలించారు. వంట గదిని శుభ్రంగా ఉంచాలని, తాజా కూరగాయలతో భోజనం అందించాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రిన్సిపాల్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా గోదావరి

- ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీ వరద
- జిల్లా కేంద్రంలో పోటు కమ్మిన రాళ్లవాగు
- ముంపు భయంలో లోతట్టు ప్రాంత ప్రజలు

మంచిర్యాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా మంగళవారం చిరు జల్లులతో వర్షం కురిసింది. వర్షం శాంతించడంతో ప్రజలు తమ పనుల్లో నిమగ్నమయ్యారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద చేరుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో 2,59,928 క్యూసెక్కులతోపాటు ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మరో 2,05,879 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుతోంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 148 మీటర్లకుగాను ప్రస్తుతం 145.71 మీటర్ల ఎత్తుకు నీళ్లు చేరుకున్నాయి. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలకుగాను ప్రస్తుతం 14.225 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతుండటంతో 32 గేట్లను ఒక మీటర్ ఎత్తు వరకు తెరిచి 4,71,712 క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి వదులుతున్నారు.

జిల్లా కేంద్రంలో పుష్కరఘాట్ పూర్తిగా నీట మునిగి ప్రవాహం ముందుకు చొచ్చుకొని వచ్చింది. ప్రజలు అటువైపు వెళ్లకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. గోదావరి ఉధృతి కారణంగా జిల్లా కేంద్రంలోని రాళ్ల వాగు నీరు నదిలోకి వెళ్లే అవకాశం లేక పోటు కమ్మింది. గోదావరి నుంచి పాత మంచిర్యాల వంతెన వరకు వాగులో నీళ్లు నిలిచాయి. దీంతో వాగు పరిసర ప్రాంతాలైన ఎన్టీఆర్‌నగర్, ఎల్‌ఐసీ కాలనీ, రాంనగర్, ఆదిత్య ఎన్‌క్లేవ్ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. గోదావరి మరింత ఉప్పొంగితే ఆయా ప్రాంతాల్లోని ఇళ్లు నీట మునిగే అవకాశం ఉంది. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ లోతట్టు ప్రాంతాల ప్రజలకు భరోసా ఇస్తున్నారు.




జిల్లా కేంద్రంలో పుష్కరఘాట్ దాటి వచ్చిన గోదావరి, ద్వారకలో నీట మునిగిన పత్తి పంట

నిలిచిన బొగ్గు ఉత్పత్తి

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి డివిజన్‌లలోని ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు తవ్వకాలు, ఓబీ మట్టి తొలగింపు పనులకు ఆటంకం ఏర్పడుతోంది. మూడు ఏరియాల్లోని శ్రీరాంపూర్, ఇందారం, రామకృష్ణాపూర్, మందమర్రి, గోలేటి, ఖైరిగూడ ఓసీపీల్లో దాదాపు రూ.26 కోట్ల విలువైన బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లగా, రూ.8 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీత నిలిచిపోయాయి.

దండేపల్లి: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో గోదావరి నదికి వరద తాకిడి పెరిగింది. శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టులో భారీగా వరద నీరు చేరడంతో గేట్ల ద్వారా నీటిని గోదావరి నదిలోకి విడుదల చేశారు. దీంతో మంచిర్యాల- జగిత్యాల జిల్లాల సరిహద్దులో గల దండేపల్లి మండలం గూడెం గోదావరి నదికి వరద ఉధృతి పెరిగింది. గోదావరి పరివాహక ప్రాంతాల్లోని పంట పొలాల్లోకి వరదనీరు చేరింది. పత్తి, వరి పంటలు నీట మునిగి దెబ్బతిన్నాయి.

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నీటి విడుదల

- ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలించిన మంత్రి శ్రీధర్‌బాబు




ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, అన్నారం బ్యారేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

హాజీపూర్, సెప్టెంబరు 3: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నీటిని ప్రణాళికబద్ధంగా నీటిని విడుదల చేస్తున్నామని రాష్ట్ర ఐటీ పరిశ్ర మలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి చేరుతున్న నీటిని పరిశీలించారు. మంత్రి మాట్లాడు తూ గోదావరి నది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రాజె క్టు నుంచి ప్రణాళిక ప్రకారం నీటిని విడుదల చేస్తున్నారన్నారు. అధికార యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అత్యవసర సేవలు అందిస్తున్నారన్నారు. ప్రజలకు అత్యవసర సేవల నిమిత్తం అధికారులను సంప్రదించాలన్నారు. అధికారు లు చేపడుతున్న రక్షణ చర్యలకు ప్రజాప్రతినిధులు పూర్తిగా సహకరించాలని తెలిపారు. ప్రాజెక్టు సమీపంలోని 70 ఎకరాలను పర్యాటక ప్రాంతానికి వినియోగిస్తామన్నారు. ప్రాజెక్టు పనులు పూర్తికావడంతో త్వరలో సీఎం రేవంత్‌రెడ్డితో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్‌లు కుమార్ దీపక్, కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్, అదనపు కలెక్టర్ మోతిలాల్, డీసీపీ భాస్కర్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, ఏసీపీ ప్రకాష్, తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండే, ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడానికి కార్యాచరణ : ఎమ్మెల్యే వివేక్

చెన్నూరు: అన్నారం బ్యాక్ వాటర్‌తో పంటలు నీట మునిగి నష్టపోతున్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేసిందని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. సుందరసాల సమీపంలోని అన్నారం బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో మునిగిన పంటలను మంగళవారం పరిశీలించారు. సుందరసాల, వెంకంపేట గ్రామాల్లో పర్యటించి నీట మునిగిన పంటలను పరిశీలించి అధికారులు, రైతులతో మాట్లాడారు. పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తానని రైతులకు భరోసా ఇచ్చారు. పంటలు నీట మునగకుండా కరకట్టల నిర్మాణానికి ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కాంట్రాక్టర్లకు దోచి పెట్టేందుకు కమీషన్‌లు దండుకునేందుకు మాజీ సీఎం కేసీఆర్ మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మించి మంచిర్యాల, చెన్నూరు, మంథని, భూపాలపల్లి నియోజకవర్గాల్లో వేల ఎకరాల్లో పంటలు నీటిలో మునిగిపోవడానికి కారణమయ్యారని పేర్కొన్నారు. మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, తహసీల్దార్ మల్లికార్జున్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. చెన్నూరు పట్టణంలో ఎమ్మెల్యే పలు కాలనీల్లో పాదయాత్ర నిర్వహించి ప్రజలను సమస్యలు తెలుసుకున్నారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసి అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

దండేపల్లి,సెప్టెంబరు 3: దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామానికి చెందిన జయరాజ్ వైద్య ఖర్చులకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అండగా నిలిచారు. జయరాజ్ హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో వైద్య ఖర్చుల కోసం రూ. 2 లక్షల 50వేల ఎల్‌వోసి పత్రాన్ని వారి కుటుంబసభ్యులకు అందజేశారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



బెల్లంపల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

బెల్లంపల్లి, సెప్టెంబరు 3: వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ సూచించారు. మంగళవారం తాళ్లగురిజాల పీహెచ్‌సీని సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను, రికార్డులు, రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా లాంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంచాయతీరాజ్, మున్సిపల్, ఐసీడీఎస్ శాఖలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, కలుషిత నీరు తాగితే కలిగే నష్టాల గురించి వివరించాలన్నారు. రాపిడ్ రెస్పాన్స్ టీంలు రెడీగా ఉండాలని, డెంగ్యూ, మలేరియా కిట్‌లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరంగా చర్యలు తీసుకొంటామన్నారు. అనంతరం ఆసుపత్రిలోని గదులను పరిశీలించారు. గదుల్లో మందులు, ఇతర డబ్బాలు ఉండడంతో గదులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిల్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ యువాంజలి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నెన్నెల: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సిబ్బంది మెరుగైన సేవ లు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్‌తో కలిసి నెన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశమై పలు సలహాలు, సూచనలిచ్చారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగేలా మెదులుకోవాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. పోస్టులు, సిబ్బంది, ఔట్ పేషంట్లు, మందుల స్టాక్ వివరాల గూర్చి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్‌ను అడిగి తెలుసుకున్నారు. జిల్లా అధికారులను సిబ్బంది సన్మానించారు.

భీమిని: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో హరీష్ రాజ్ తనిఖీ చేశారు. ఈ నెలలో ఎంత మంది ప్రసవానికి ఉన్నారో వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మరింత చేరువగా నాణ్యమైన సేవలు అందించాలని, ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను పెంచాలని వైద్యుడిని ఆదేశించారు. ఇన్, అవుట్ పేషంట్లు, మందులను తనిఖీ చేశారు. అత్యవసర మందులు, కుక్క కాటు ఇంజెక్షన్లు అందుబాటులో ఉండాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, వైద్యుడు కుమారస్వామి, స్టాఫ్‌నర్స్ జలపతి పాల్గొన్నారు.



భీమినిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



అంగన్‌వాడి కేంద్రంలో అక్షరభాస్యం చేయిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో

దండేపల్లి, సెప్టెంబర్ 3 : అంగన్‌వాడి కేంద్రాలు అందించే పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని లక్షెట్టిపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో రేష్మ అన్నారు. గుడిరేవు అంగన్‌వాడి కేంద్రంలో మంగళవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆకుకూరలు, పండ్లు, కోడిగుడ్లు, మొలకెత్తిన విత్తనాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. పోషణ అభియాన్ కార్యక్రమాలను అంగన్‌వాడి కేంద్రాల్లో నిర్వహించాలన్నారు. ఐసీడీఎస్ ఇన్‌చార్జి సూపర్‌వైజర్ కవిత, టీచర్లు ప్రసన్నకుమారి, రాజేశ్వరీ, లక్ష్మి, పద్మ,భాగ్య పాల్గొన్నారు.

పోషణ్ అభియాన్ ర్యాలీ

జన్నారం, సెప్టెంబరు 3: పొనకల్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ అభియాన్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో శశికళ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, సరస్వతి, పంచాయతీ కార్యదర్శులు రాహుల్, మహేష్, శ్రీపాల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సరోజ

లక్షెట్టిపేటరూరల్, సెప్టెంబరు 3 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సరోజ అన్నారు. జెండా వెంకటాపూర్ రైతువేదికలో మంగళవారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రధాన మంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తోటి తెగ గిరిజనుల అభివృద్ధికి ప్రధానమంత్రి జన్ ధన్ పథకం కింద జీరో అకౌంట్, మీసేవ ద్వారా ఆధార్‌కార్డు, విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేస్తారని తెలిపారు. అనంతరం వైద్య ఆరోగ్య సిబ్బంది గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ పురుషోత్తం, రీసోర్స్ పర్సన్ రఘునాధం, ఏపీవో వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో డీఏవీ పాఠశాల ఉపాధ్యాయులు

కాసిపేట, సెప్టెంబరు 3: దయానంద్ ఆంగ్లోవేదిక్ పాఠశాల సముదాయల ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో దేవాపూర్ డీఏవీ పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో దేవాపూర్ నుంచి 39 మంది పాల్గొనగా అథ్లెటిక్స్‌లో 21 మంది బంగారు, 35 మంది వెండి, 3 కాంస్య పతకాలు, కబడ్డీలో 11 మంది వెండి పతకాలను సాధించినట్లు తెలిపారు. అక్టోబరులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. ఉపాధ్యాయులు వినోద్, సుమలత, డీఏవీ సౌత్ జోన్ రీజనల్ ఆఫీసర్ ఆనందవల్లి, దేవాపూర్ ఓరియంట్ కంపెనీ యూనిట్ హెడ్ బాల గిరిధర్, హెచ్‌ఆర్ జీఎం ఆనంద్ కులకర్ణి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మద్దికల్‌లో వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

భీమారం, సెప్టెంబరు 3: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు సూచించారు. మండలంలోని మద్దికల్, కొత్తపల్లి గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేయగా 62 మంది జ్వరంతో ఉన్నట్లు గుర్తించారు. 12 మంది నుంచి రక్తనమూనాలను సేకరించారు. కొందరికి మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు ఉండడంతో మందులు అందజేశారు. మెడికల్ ఆఫీసర్ ముస్తాఫా మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సురక్షిత నీరు తాగాలని సూచించారు. ఏఎన్‌ఎంలు ఉమాదేవి, సుజాత, హెల్త్ అసిస్టెంట్ వేణు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటపల్లి: శెట్‌పల్లి గ్రామంలో మంగళ వారం వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సీహెచ్‌వో సంగయ్య, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్‌గౌడ్, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

బాలికల ఆశ్రమ పాఠశాలలలో డెంగ్యూ నివారణ చర్యలు

లక్షెట్టిపేటరూరల్, సెప్టెంబరు 3: పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో డెంగ్యూ జ్వరాలు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టారు. వైద్యాధికారి సతీష్‌కుమార్ మాట్లాడుతూ వెంకట్రావుపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో దోమల నివారణ మందు పిచికారి చేశామన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో థైమిఫాస్ మందును స్ప్రే చేయించారు. హాస్టల్ వార్డెన్ మల్లారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీజ, హెల్త్ అసిస్టెంట్ గఫూర్, ఇసాక్, ఏఎన్‌ఎం విజయ, సుజాత పాల్గొన్నారు.



దోమల నివారణ మందులను స్ప్రే చేస్తున్న సిబ్బంది



కమిషనరేట్ పరిధిలో షీటీంలకు స్పందన

కోల్‌సిటీ, సెప్టెంబరు 3: రామగుండం కమిషనరేట్‌లో షీటీంలకు మంచి స్పందన లభిస్తుందని, బాధిత మహిళలు, విద్యార్థినులు ఫోన్ల ద్వారా సంప్రదిస్తున్నారని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

● ఆగస్టులో 9 ఫిర్యాదులు ● పలువురికి కౌన్సెలింగ్

ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. మహిళలు, బాలికలు, విద్యార్థినుల భద్రతే లక్ష్యంగా షీటీంలు పని చేస్తున్నాయన్నారు. కమిషన రేట్‌లో రెండు బృందాలు ఉన్నాయని, స్కూల్స్, కాలేజీల వద్ద ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, ఫోక్సో, గుడ్, బ్యాడ్ టచ్, ఆత్మహత్యలు, డ్రగ్స్, బాల్య వివా హాలు, సైబర్ క్రైమ్, వరకట్న చట్టాలు, మహిళా చట్టాల గురించి అవగా హన కల్పిస్తున్నాయన్నారు. మహిళలు, బాలికలపై ఆన్‌లైన్‌లో అసభ్యకర పోస్టులు పెట్టే సైబర్ నేరగాళ్లపై కూడా సైబర్, షీటీం సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. కమిషనరేట్ షీటీం నెం. 6303923700కు కాల్ చేయాలని, వాట్సాప్ ద్వారా సందేశం పంపవచ్చు న్నారు. డయల్ 100కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు. ఆగస్టు నెలలో 9ఫిర్యాదులు వచ్చాయని, అందులో ఏడు ఫిర్యాదులు పెద్దపల్లి, మంచిర్యాల షీటీమ్ కార్యాలయానికి నేరుగా ఫిర్యాదు చేశారన్నారు. బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఒక ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని, మిగతా 8ఫిర్యాదులపై కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. కమిషరేట్ పరిధిలో షీటీం ఆధ్వర్యంలో 57అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, 204హాట్ స్పాట్లను విజిట్ చేశామన్నారు.

లాభాల వాటా వెంటనే ప్రకటించాలి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 3: సింగరేణి సంస్థ 35 శాతం లాభాల వాటా వెంటనే ప్రకటించాలని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శులు ఎస్. వెంక టస్వామి, అల్లి రాజేందర్‌లు పేర్కొన్నారు. మంగళవారం ఏరియాలోని రీజ నల్ ఆన్‌లైటికల్ ల్యాబ్‌లో గేట్‌మీటింగ్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు కావస్తున్నా గత సంవత్స రం లాభాల వాటా చెల్లించకపోవడం సరైంది కాదన్నారు. వెంటనే లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు చివరి నాటికి లాభాల వాటా చెల్లించకపోతే ఆందోళనలు చేస్తామన్నారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందించారు.

కేజీబీవీని సందర్శించిన డీఈవో

లక్షెట్టిపేటరూరల్, సెప్టెంబరు 3 : లక్షెట్టిపేటలోని కేజీబీవీ పాఠశాలను మంగళవారం డీఈవో యాదయ్య సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి ప్రతిభను పరిశీలించారు. 10 జీపీఏ సాధించడానికి పట్టుదలతో చదవాలన్నారు. అనంతరం వసతుల గురించి ఆరా తీశారు. రిజిస్టర్‌లను పరిశీలించారు. గుల్లకోట, సూరారం పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 3: జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి జరిగే బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రధాని మోదీ, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలు ప్రారంభిస్తారన్నారు.

లైన్‌మన్‌పై ప్రజల ఫిర్యాదు

హాజీపూర్, సెప్టెంబరు 3 : మండలంలోని గుడిపేట లైన్‌మన్ పైసలు ఇస్తేనే పనులు చేస్తున్నాడని ప్రజలు ఆరోపిస్తున్నారు. లేకుంటే నెలల తరబడి పెండింగ్‌లో పెడుతున్నాడని పేర్కొంటున్నారు. ప్రశ్నించిన వారి పై దుసురుగా ప్రవర్తిస్తున్నాడని, ఒక వార్డులో 6 కరెంటు స్తంభాలు వేసేందుకు రూ.60 వేలు తీసుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. లైన్‌మెన్ జిల్లా కేంద్రంలో ఉంటూ విధులు నిర్వహిస్తున్నాడని, ఈయన వ్యవహా రంపై రైతులు ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు విద్యుత్ సరఫరా కోసం సంప్రదిస్తే పట్టించుకోవడం లేదని యువకులు తెలిపారు. గుడిపేట, నంనూర్, చందనపూర్ గ్రామాల్లో వీధి లైట్లు సరిగ్గా లేవు. గ్రామ పంచాయతీ వారు లైట్లు పెడతామని ఎల్‌సీ ఇవ్వమంటే ఇవ్వడం లేదు. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా లైన్‌మెన్ ప్రవర్తనలో మార్పు రావడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

కుక్కల తరలింపు

మందమర్రి టౌన్, సెప్టెంబరు 3: పట్టణంలోని మార్కెట్ ఏరియా, రామన్ కాలనీ, రెండో జోన్, మూడో జోన్, కేకే 5 ఫిల్టర్‌బెడ్‌తో పాటు ప్రాణహిత కాలనీ, పాలచెట్టు ఏరియాల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ వచ్చిపోయే వారిపై ఎగబడుతున్నాయి. దీంతో ప్రజలు కుక్కల బెడద నుంచి విముక్తి కలిగించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేష్‌కు వినతి పత్రాలు సమర్పించారు. మున్సిపల్ అధికారులు మంగళవారం మార్కెట్ ఏరియాలో కుక్కలను పట్టుకొని ప్రత్యేక వాహనాల్లో తరలించారు. రెండు రోజుల పాటు అన్ని కాలనీల్లో పిచ్చి కుక్కలను పట్టుకొని తీసుకెళ్తామని తెలిపారు. పెంపుడు కుక్కలకు బెల్ట్ పెట్టుకొని ఇంటి వద్దే ఉంచుకోవాలని సూచించారు.













ద్విచక్ర వాహనంపై నుంచి పడి మహిళ మృతి


సరోజ (ఫైల్)

బెల్లంపల్లి(తాండూర్), సెప్టెంబరు 3: తాండూర్ మండలం బోయపల్లి గ్రామానికి చెందిన మాసాడి సరోజ (45) మంగళవారం ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి మృతి చెందింది. కుమారుడు అజయ్‌తో బైక్‌పై సరోజన వెళుతుండగా బోయపల్లి గ్రామ శివారులోని రైతువేదిక వద్ద బైక్‌పై నుంచి కింద పడింది. దీంతో తీవ్ర గాయాలు కాగా స్థానికులు బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. భర్త సత్య నారాయణ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

గోదావరి ప్రవాహంలో కొట్టుకుపోయిన నాటు పడవలు

కోటపల్లి, సెప్టెంబరు 3: గోదావరి నది ఉధృతిలో మంగళవారం సాయంత్రం రెండు నాటు పడవలు కొట్టుకుపోయాయి. ఎర్రాయిపేట గ్రామానికి చెందిన చేపల జాలరి మహేష్‌కు చెందిన రెండు నాటు పడవలు నది ప్రవాహంలో కొట్టుకుపోయాయి. చేపల వేటకు వినియోగించే పడవలు ఒడ్డు వైపు ఉండగా నది ప్రవాహం ఉధృతంగా మారడంతో కొట్టుకుపోయినట్లు యజమాని మహేష్ పేర్కొన్నారు. వీటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

ఉద్యోగ సంఘాల జేఏసీ చేయూత

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 3 : వర్షాల కారణంగా నష్టపోయిన వారి కోసం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జేఏసీ తరుపున ప్రభుత్వానికి ఒక రోజు వేతనాన్ని అందజేసినట్లు జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి తెలిపారు. రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావుల అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించి రూ.130 కోట్లను ముఖ్య మంత్రి సహాయనిధికి అందించేందుకు తీర్మానించినట్లు తెలిపారు.

గంజాయికి దూరంగా ఉండండి : సీపీ

మంచిర్యాల అర్బన్, సెప్టెంబరు 3: గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన వారు మనసు మార్చుకొని గంజాయికి దూరంగా ఉండాలని, లేదంటే పీడీయాక్టు అమలు చేస్తామని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆనంద నిలయం (వృద్ధులు, అనాథ పిల్లల ఆశ్రమం)లో గంజాయికి అలవాటైన వారితో ఆశ్రమంలో మొక్కలు నాటించి పరిసరాలను శుభ్రం చేయించారు. ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సీపీ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే గంజాయికి బానిసలుగా మారిన యువతను చూస్తే బాధ కల్గుతుందన్నారు. యువతను చెడు వ్యసనాల నుంచి కాపాడేందుకు పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికైనా పట్టుబడిన యువకులు మారాలని, లేదంటే పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామన్నారు. గంజాయిని ఎవరైనా రవాణా చేసినా, విక్రయించినా, సేవించినా కంట్రోల్ 87126 56597కు సమాచారం అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. వృద్ధులు, పిల్లలకు సీపీ దుప్పట్లను, పండ్లను పంపిణీ చేశారు. డీసీపీ ఏ.భాస్కర్, అడీషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు, మంచిర్యాల, బెల్లంపల్లి ఏసీపీలు ఆర్.ప్రకాష్, రవి కుమార్, సీఐలు, ఎస్సైలు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యు లు కె.భాస్కర్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, వి.మధుసూదన్ రెడ్డి, కె.సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీపీ

కాంట్రాక్ట్ కార్మికులకు మొదటి కేటగిరి వేతనం ఇవ్వాలి

-మావోయిస్టు పార్టీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ హైపవర్ కమిటీ సూచనల ప్రకారం మొదటి కేటగిరి వేతనాలు చెల్లించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సింగరేణిలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు 29 వేల మంది శ్రమదోపిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. నెలల తరబడి వేతనాలు చెల్లించకుండా మోసం చేస్తున్న కాంట్రాక్టర్‌లు ప్రతినెల కార్మికుల పేర్లపై జమ చేయాల్సిన పీఎఫ్ నిధులను కూడా స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్లు, సింగరేణి అధికారులు కుమ్మక్కయి కాంట్రాక్ట్ కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. శ్రీరాంపూర్ ఏరియాలో సుశి కాంట్రాక్టు కంపెనీ, అధికారులు కుమ్మక్కయి రూ.5 కోట్ల పీఎఫ్ నిధులను స్వాహా చేశారన్నారు. కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాల్సిన చట్టపరమైన వేతనాలు, అలవెన్స్‌లు చెల్లించకపోగా కార్మికులపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. కాంట్రాక్టులు రద్దయినా, పనులు ముగిసినా కాంట్రాక్టు కార్మికులు ఉద్యోగాలు కోల్పోవడం ద్వారా జీవనోపాధికి దూరమవుతున్నారని తెలిపారు. దీంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి యేటా ఉత్పత్తి లక్ష్యాన్ని పెంచుకుంటూ లాభాపేక్షే ధ్యేయంగా కాంట్రాక్టు కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందని, ప్రమాదాలకు గురవుతున్న కాంట్రాక్ట్ కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నా ఎలాంటి నైతిక బాధ్యత వహించడం లేదని విమర్శించారు. కార్మికుల వేతనాలను క్రమం తప్పకుండా చెల్లించడం, పీఎఫ్ నిధులను నెలనెలా జమ చేయడం, జీతం చిట్టీలను ప్రతి కార్మికునికి ఇవ్వడంతో పాటు వారి కుటుంబాలకు కంపెనీ దవాఖానాల్లో ఉచిత చికిత్స అందించాలని డిమాండ్ చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

మందమర్రిరూరల్, సెప్టెంబరు 3: మండంలోని పొన్నారం గ్రామంలో బీజేపీ నాయకులు నిరుపేదలకు నిత్యావసర సరుకులు మంగళవారం పంపిణీ చేశారు. మండల ఇన్‌చార్జీ దేవరనేని సంజీవరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. దార రవిసాగర్ ఆధ్వర్యంలో సరుకులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బోర్లకుంట లక్ష్మణ్, శామ్యూల్, దిలీప్, నాగరాజు, నందన్ తదితరులు పాల్గొన్నారు.

బుడగ జంగాల కాలనీని సందర్శించిన గిరిజన కార్పొరేషన్ చైర్మన్

జన్నారం, సెప్టెంబరు 3: మండలంలోని పొన్కల్ పంచాయతీ పరిధిలోని బుడగ జంగాల కాలనీలో కురుస్తున్న వర్షాలకు వాగు ఉప్పొంగి ఇండ్లలోకి నీరు చేరడంతో ఆ కాలనీని తెలంగాణ రాష్ట్ర గిరిజన కో ఆపిరేటివ్ సొసైటీ చైర్మన్ కోట్నాక తిరుపతి మంగళవారం సందర్శించారు. కాలనీ వాసులతో మాట్లాడారు. కాలనీలో రోడ్లు, విద్యుత్ సౌకర్యం లేదని, తమను ఆదుకోవాలని కోరారు. స్పందించిన చైర్మన్ కాలనీలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కాలనీ వాసులకు అన్నదానం చేశారు. అనంతరం కాలనీ వాసులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సోహెల్, అజ్మత్‌ఖాన్, సాయికుమార్, మహ్మద్, చందు, రాజేశ్వర్, నయీంపాషా, తిరుపతి, సృజన్, అక్షయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులను ఆక్రమిస్తే చర్యలు


చెరువును పరిశీలిస్తున్న అధికారులు

లక్షెట్టిపేటరూరల్, సెప్టెంబరు 3: చెరువులను ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఇరిగేషన్ డీఈ కుమార్ హెచ్చరించారు. ఇటిక్యాల లక్షెట్టిపేట చెరువులో కొందరు మొరం పోసి ఆక్రమిస్తున్నారననే సమాచారం మేరకు మంగళవారం తహసీల్దార్, ఎస్ఐ, మున్సిపల్ కమిషనర్‌లతో కలిసి పరిశీలించారు. ఈ నెల 2న రాత్రి చెరువులు మొరం పోస్తున్నారని సమాచారం మేరకు ఎఫ్‌టీఎల్ హద్దులను ఎక్స్‌కావేటర్‌తో ఏర్పాటు చేయడంతో పాటు ట్రెంచ్ వేశారు. ఆయన మాట్లాడుతూ ఇటిక్యాల సర్వే నెంబరు 333లో ఉన్న చెరువు విస్తీర్ణం సుమారు 43 ఎకరాలు ఉందని, లక్షెట్టిపేట సర్వే నెంబరు 9లో ఉన్న చెరువు 23 ఎకరాల విస్తీర్ణంలో ఉందన్నారు. ఈ చెరువు పరిసరాల్లో భూములు ఆక్రమణకు గురవుతున్నట్లు ఫిర్యాదు రావడంతో ట్రెంచ్ వేశామన్నారు. అక్రమంగా పోసిన మొరంను మున్సిపాలిటీకి అప్పగించినట్లు తెలిపారు. ఎఫ్‌టీఎల్ అనంతరం 30 మీటర్ల వరకు బఫర్ జోన్‌గా పరిగణనలోకి తీసుకొంటామన్నారు. ఈ ప్రాంతంలో నిర్మాణాలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే కూల్చివేస్తామన్నారు. తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎస్ఐ సతీష్, కమిషనర్ వెంకటేష్, ఇరిగేషన్ ఏఈ గౌతం, సర్వేయర్ సదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి


వేలాల వద్ద గోదావరి ఉధృతిని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో గణపతి

జైపూర్, సెప్టెంబరు 3: వర్షాల నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈవో గణపతి పేర్కొన్నారు. మంగళవారం కిష్టాపూర్, వేలాల, పౌనూరు, శివ్వారం గ్రామాలను సందర్శించారు. వేలాల వద్ద గోదావరి నది ఉధృతిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమలు, ఈగల నివారణకు ఫాగింగ్ చేయించాలని కార్యదర్శులకు సూచించారు. ప్రజలు ఎవరు కూడా గోదావరి వైపు వెళ్ళవద్దన్నారు. కలుషిత నీరు తాగితే వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్, పాల్గొన్నారు.

వేమనపల్లి: నీల్వాయి, కల్లెంపల్లి గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ పర్యటించారు. నీల్వాయి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మన ఊరు మన బడి పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కేజీబీవీ పాఠశాలలో భోజన వసతులు, సౌకర్యాలపై ఎస్‌వోను తెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలన్నారు. పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలని కార్యదర్శులకు సూచించారు. కల్లంపల్లి పంచాయతీలో పారిశుధ్య పనులను పరిశీలించారు. నూతన పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలోని అమ్మ ఆదర్శ కమిటీ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా బడగ పండుగ

- మట్టితో ఎద్దులను తయారు చేసి పూజలు
- అనంతరం చెరువులో నిమజ్జనం


అచ్చలాపూర్, మ్యాదరిపేటలో బడగ పండగ వేడుకలు

బెల్లంపల్లి(తాండూర్), సెప్టెంబరు 3: తాండూర్ మండంలోని అచ్చలాపూర్(కొమ్ముగూడెం)లో మంగళవారం నేతకాని కులస్తులు బడగ పండగను ఘనంగా నిర్వహించారు. పొలాల అమావాస్య రోజున ఉపవాస దీక్షలు చేసి తర్వాత రోజు బడగ పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. బడగ పండగను పురస్కరించుకుని ఇండ్లలో పిండి వంటలు చేసుకుని బంక మట్టితో ఎడ్లను తయారు చేసి పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి దీక్షలను పూర్తి చేశారు. అనంతరం మట్టి ఎడ్లను గంపలలో డప్పుచప్పుళ్లతో వెళ్లి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

నెన్నెల: పొలాల పండుగను నేతకాని మహార్ కులస్తులు ఐదు రోజులు ఘనంగా జరుపుకుంటారు. మంగళవారం బసవన్నల ప్రతిమలను ఊరేగించి నిమజ్జనం చేశారు. అమావాస్య రోజున గ్రామ పొలిమేరల నుంచి తెచ్చిన మట్టితో బసవన్నల ప్రతిమ లు చేసి పూజించి మరుసటి రోజు నిమజ్జనం చేస్తారు. మిగతా మట్టితో గురుగులు చేసి వాటిలో పెరుగు తోడేసి మహిళలు మరో రెండు రోజులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గుండ్లసోమారం మాజీ ఎంపీటీసీ దాగం రమేష్, మెట్‌పల్లి మాజీ సర్పంచ్ శివప్రసాద్, బోర్లకుంట శంకర్, జాడి చంద్రయ్య, కుమార్, రాంచందర్, జాడి స్వామి పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలో బడగ పండగను రైతులు, ఆదివాసీలు ఘనంగా జరుపుకున్నారు. పిండి వంటలను గ్రామ శివారులోకి తీసుకువెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాడి పంటలు బాగుండాలని, ప్రజలకు అంటు రోగాలు రావద్దని పూజలు చేశారు.

దండేపల్లి : ఆదివాసి గిరిజన గ్రామాల్లో జాగేయ్ మాతరి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మ్యాదరిపేటలో పర్దన్‌గూడ గిరిజనులు పొలాల అమావాస్య మరుసటి రోజు వెదురు కర్రలు పట్టుకుని ఇంటిపై కప్పులను కొడుతూ జాగేయ్ మాతరి అంటు గ్రామ శివారుకు వెళ్లారు. అక్కడ పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల నుంచి విముక్తి పొందాలని ఆదివాసీల ఆచారం ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు.

ఆదివాసీ మహిళపై ఆటో డ్రైవర్ అత్యాచారయత్నం, దాడి

- రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం
- నిందితుడిని శిక్షించాలని జైనూర్‌లో ఆదివాసీ సంఘాల ఆందోళన


జైనూర్‌లో ఆందోళన చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 3: ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్న ఆదివాసీ మహిళ(45)ను ఆటోలో ఎక్కించుకున్న డ్రైవర్ అత్యాచారయత్నం చేసి ఆపై కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యూ) మండలంలో చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగు చూసింది. ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జైనూరు మండలానికి చెందిన ఆదివాసీ మహిళ గత నెల 31న సిర్పూర్(యూ) మండలంలోని తన తల్లిగారి గ్రామమైన సోయగూడెంకు నడుచుకుంటూ వెళుతోంది. ఈ క్రమంలో రాఘాపూర్ దాటిన తర్వాత స్పృహ కోల్పోయిన స్థితిలో రోడ్డుపై పడి ఉంది. ఎవరో గుర్తుతెలియని వ్యక్తి వాహనంతో ఢీకొట్టి వెళ్లిపోయి ఉంటాడని, రోడ్డుపై వెళుతున్న వారు గమనించి 108కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది ఆ మహిళను ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సిర్పూర్(యూ) పోలీసుస్టేషన్‌లో ఈ నెల 1న కేసు నమోదు చేశారు. బాధిత మహిళ స్పృహలోకి రావడంతో సోమవారం పోలీసులు గాంధీ ఆస్పతికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. జైనూర్ మండలం సోనుపటేల్‌గూడకు చెందిన మక్దూం అనే వ్యక్తి ఆమెను ఆటోలో ఎక్కించుకొని రాఘాపూర్ దాటిన తర్వాత అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఆమె ప్రతిఘటించింది. దీంతో ఆమెను చితకబాదాడు. మహిళ స్పృహ కోల్పోయింది. చనిపోయిందని ఆటో డ్రైవర్ రోడ్డు ప్రమాదం జరిగిందని భావించేలా ఆమెను రోడ్డుపై పడవేసి అక్కడి నుంచి పరార య్యాడు. ఆ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు 108కు సమాచారం అందించడంతో ఆస్పతికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ మక్దూంపై అత్యాచారయత్నం, హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు.

జైనూర్: జైనూర్ మండలానికి చెందిన ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నంతోపాటు దాడికి పాల్పడిన ఆటో డ్రైవర్ షేక్ మక్దూంని ఉరి తీయాలని ఆదివాసీల సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం రాస్తారోకో చేశారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. ఆదివాసీ సంఘాల జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కనక యాదవ్‌రావు మాట్లాడుతూ ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సంఘటనకు నిరసనగా బుధవారం ఏజెన్సీ బంద్ పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. బంద్‌ను ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీలు విజయవంతం చేయాలని కోరారు. ఆందోళనలో జైనూరు, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

జైనూర్‌లో 85.8 మిల్లీమీటర్ల వర్షం

ఆసిఫాబాద్, సెప్టెంబరు 3: కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో 85.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సిర్పూర్(యూ)లో 30.8, లింగాపూర్‌లో 22.5, రెబ్బెనలో 14.0, కెరమెరి మండలం దనోరాలో 13.8, రెబ్బెన మండలం వంకుళంలో 0.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

దుప్పి మాంసం లభ్యం

పెంచికలపేట, సెప్టెంబరు 3: మండలంలోని మేరేగూడలో ఓ ఇంట్లో మంగళవారం దుప్పి మాంసం లభ్యమైంది. విశ్వసనీయ సమాచారం మేరకు మేరేగూడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో సోదాలు నిర్వహించగా దుప్పి మాంసం లభ్యమైనట్లు ఎఫ్ఆర్వో అనీల్‌కుమార్ తెలిపారు. మాంసాన్ని స్వాధీన పర్చుకొని విచారణ చేస్తున్నామని తెలిపారు.

యథేచ్ఛగా పశువుల అక్రమ రవాణా

- పట్టించుకోని అధికారులు



రెబ్బెనలో పట్టుకున్న పశువులు(ఫైల్)

కాగజ్‌నగర్, సెప్టెంబరు 3: జిల్లాలో పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అధికారులు పట్టించుకోక పోవడంతో అక్రమ రవాణా దారలతే ఇష్టారాజ్యంగా కొనసాగుతోంది. నిబంధనల ప్రకారం పశువులను తరలించాల్సి ఉండగా అందరికి మాముళ్లు ఇస్తుండగా ఇష్టారీతిన ట్రక్స్, లారీల్లో, ఐచర్ వ్యాన్‌లో తరలిస్తున్నారు. ఇటీవల రెబ్బెన మండలం తక్కలపల్లి బస్టాండు సమీపంలో గల ఎకో బ్రిడ్జి వద్ద అక్రమంగా తరలిస్తున్న పశువులను తరలిస్తున్న వాహనాన్ని అధికారులు పట్టుకున్నారు. వాహనంలో 24 పశువుల తరలిస్తున్నారు. ఇందులో మూడు ఎద్దులు, 21 ఆవులు ఉన్నాయి. ఊపిరి ఆడక ఇందులో తొమ్మిది ఆవులు మృతి చెందాయి. మహారాష్ట్ర కేంద్రంగా వ్యాపారం కొనసాగుతోంది. వీటిని తరలించే వాహనం ముందు అనచరులు ముందుగా పరిశీలించి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన తర్వాతనే పశువుల లోడ్ వాహనాలను తరలిస్తున్నారు. ఆరు నెలల క్రితం కూడా కాగజ్‌నగర్ పెద్దవాగు బ్రిడ్జి వద్ద కూడా పశువులను తరలిస్తున్న క్రమంలో మూడు ఆవులు మృత్యువాత పడ్డాయి. మృతి చెందిన పశువులను పెద్దవాగు సమీపంలో పడేసి పోయారు. ఈ మార్గంలో వెళ్లుతున్న వాహనాలదారులకు దుర్గంధం వస్తుండడంతో గమనించి అధికారులకు సమాచారం అందించారు.అధికారులు దీనిపై కఠిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. పశువులను మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్, సిర్పూరు నియోజకవర్గాల మీదుగా నేరుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ అక్రమ రవాణాపై గట్టి నిఘా పెట్టి కేసులు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై డీఎస్పీ కరుణాకర్‌ను వివరణ కోరగా పశువుల అక్రమ రవాణా విషయంలో ఎవరిని ఊపేక్షించేది లేదని, కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 3: ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో పలువురు పట్టణ ప్రముఖులు చేరారు. ఇట్యాల మాజీ ఎంపీటీసీ గజ్జల సురేష్, జయక్కితో పాటు ప్రముఖ వ్యాపారి గజ్జల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దండెవిఠల్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు తీర్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఎళ్లవేళలా ముందు ఉంటుందన్నారు. పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని తెలిపారు. దహెగాం మండలంలోని ఇట్యాల, రాళ్లవాగు, బొర్లకుంట, కోత్మీర్ మాజీ సర్పంచిలు కూడా చేరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఎంపీపీ పిల్లల శంకరయ్య, మాజీ సర్పంచి మురళి, రాంటెంకి మల్లేష్, పెద్ది శ్రీనివాస్, రైతు కమిటీ అధ్యక్షుడు జగ్గాగౌడ్, మాజీ సర్పంచి మురారి, రాంటెంకి మల్లేష్, పెద్దిశ్రీనివాస్, కొండ్రజగ్గాగౌడ్, తదితరులున్నారు.


కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు

జ్వరంతో బాలిక మృతి


గంగోత్రి(ఫైల్)

సిర్పూర్(టి), సెప్టెంబరు 3: ఐదు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బాలిక దంద్రె గంగోత్రి(14) మంగళవారం మృతి చెందింది. బాలికకు ఐదు రోజుల క్రితం జ్వరగా రావడంతో తల్లిదండ్రులు స్థానికంగా చికిత్స చేయించారు. జ్వరం తగ్గక పోవడంతో మంగళవారం సిర్పూర్(టి) ఆసుపత్రికి తీసుకు రాగా అప్పటికే మృతి చెందిందని ఆసుపత్రి డాక్టర్ జోగేందర్ తెలిపారు. బాలిక పచ్చకామెర్లు, రక్తహీనతతో బాధపడుతుందని తల్లిదండ్రులు తెలిపారు. గంగోత్రి స్థానిక పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువు తున్నది.

చుక్కల దుప్పిని వేటాడిన ఐదుగురి రిమాండ్

సిర్పూర్(టి), సెప్టెంబరు 3: చుక్కల దుప్పివేటాడిన సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని భూపాలపట్నంకు చెందిన ఐదుగురి వ్యక్తులకు 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్వో ఎక్బాల్ హుస్సేన్ తెలిపారు. భూపాలపట్నం గ్రామానికి చెందిన జెల్లా శ్రీనివాస్, కోట శంకర్, నూకల శ్రీనివాస్, బూరం రమేష్, కాషాబోయిన సత్త య్య అనే వ్యక్తులు గత నెల 3న చుక్కల దుప్పిని వేట కుక్కలతో వేటాడగా అటవీ అధికా రులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారని చెప్పారు. తప్పును ఒప్పుకోవడంతో మంగళవారం సిర్పూర్(టి) కోర్టు జడ్జి ఎదుట హాజరు పరుచగా వారికి 14రోజుల రిమాండ్ విధించారు.

కాగజ్‌నగర్ ఎఫ్‌డీవోగా బాధ్యతల స్వీకరణ

కాగజ్‌నగర్, సెప్టెంబరు 3: కాగజ్‌నగర్ ఎఫ్‌డీవోగా సుషాంత్ సుకదేవ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జి ఎఫ్‌డీఓగా అప్పలకొండ విధులు నిర్వహించారు. ఇండియన్ ఫారెస్టు సర్వీస్‌కు 2022లో ఎంపికైన తొలి పోస్టింగ్ కాగజ్‌నగర్‌కు కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంరక్షణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు రాక బడిలోనే చిన్నారుల ఆటలు


గురుడుపేట పాఠశాలలో ఆటలు ఆడుతున్న చిన్నారులు

కౌటాల, సెప్టెంబరు 3: కౌటాల మండలంలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం కాక పోవడంతో విద్యార్థులు ఉదయం పూటనే పాఠశాలకు వచ్చి ఆటలు ఆడుకుంటూ ఇంటికెళ్లుతున్నారు. మండలంలోని గురుడుపేట, మొగడ్ధగడ్, కనికి, జనగాం, శివలింగాపూర్ గ్రామాల్లో ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో బోధించేందుకు ఉపాధ్యాయులకు బదిలీ జరిగాయి. ఇంత వరకు వీరి స్థానం కొత్త వారు రాక పోవటంతో విద్యార్థులు ఉదయం పూటనే పాఠశాలకు వచ్చి కాసేపు ఆటలు ఆడి ఇంటికెళ్లుతున్నారు. గురుడుపేటకు ఉపాధ్యాయున్ని కేటాయించినప్పటికీ సెలవుపై వెళ్లటంతో ఆ పాఠశాల పరిస్థితి కూడా ఇదే తరహాలో ఉంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో వెంటనే స్పందించి ఈ పాఠశాలపై గట్టి నిఘా పెట్టి నిత్యం నడిచేట్లు చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కోడి పందెలు నిర్వహిస్తున్న 12 మందిపై కేసు నమోదు

చింతలమానేపల్లి, సెప్టెంబరు 3: మండలంలోని కర్జవెల్లి, బాలాజీ అనుకోడ గ్రామంలో కోడి పందాలు నిర్వహిస్తున్న 12 మంది పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. కర్జవెల్లికి చెందిన వాగ్మారే నారాయణ, రౌతు సుధాకర్, యాల్కరే శంకర్, తెరిగే పాపయ్య, నాయిని మరయ్య, బుర్రి నీలయ్య, మేకల పుల్లయ్య, బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన ఎమ్మల రాజు, జునగరే రాజన్న, మానెపల్లి పురుషోత్తం, దుర్గం శ్యాంరావు, ఎస్ సాయికిరణ్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరి నుంచి రూ2,880 నగదు, 9 కోడి పుంజులు, 35 కత్తులను స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై సురేష్ తెలిపారు.

మండల వ్యాప్తంగా బడగ పండుగ

కెరమెరి, సెప్టెంబరు 3: పొలాల అమావాస్య పండగ మరుసటి రోజు నిర్వహించే బడగ పండుగను మండల వ్యాప్తంగా మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉదయం రైతులు గ్రామ పొలిమేరల వరకు వెళ్లి అక్కడి నుంచి పలు రకాల మొక్కలు తీసుకు వచ్చి ఇంటి ముందు భాగంలో కట్టారు.


ఆసిఫాబాద్: పొలాల అమావాస్య మరుసటి రోజు కట్టే బొమ్మల బసవన్నలతో ఊరేగింపు చేపట్టడం అనవాయితీగా వస్తోంది. చిన్నారులు బొమ్మ బసవన్నలతో బ్రాహ్మణవాడ, రావులవాడ మీదుగా ప్రదర్శన చేపట్టి గాంధీచౌక్‌లోని అంకమ్మరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహ్మణసమాజ్ సభ్యులు మనోజ్, ప్రతాప్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

దహెగాం: మండల వ్యాప్తంగా పొలాల పండగ సందర్భంగా రైతులు మట్టితో తయారు చేసిన ఎద్దులను ఇళ్లలో ప్రతిష్టాపించి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం చిన్న పొలాల పండగను పురస్కరించుకుని మట్టి ఎద్దులను వాగులలో నిమజ్జనం చేశారు.

ఎస్పీఎం గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులకు ఓటు హక్కు కల్పించాలి

కాగజ్‌నగర్, సెప్టెంబరు 3: త్వరలోనే నిర్వహించే ఎస్పీఎంలో ట్రేడ్ యూనియన్ కార్మికులకు, కాంట్రాక్టు కార్మికులకు కూడా ఓటు హక్కు కల్పించాలని బుధవారం ఎస్పీఎం ప్రొటెక్షన్ నంబరు ఈ-2381 సంఘం సభ్యులు జిల్లా సహాయ కార్మిక శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో అంబాల ఓదెలు, గోగర్ల కన్నయ్య, వల్లాల సుభాష్ ఉన్నారు.





విద్యావ్యవస్థను బలోపేతం చేస్తామంటూ ప్రభుత్వం చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో చర్యలకు పొంతన లేకుండా పోయింది. గత ప్రభుత్వం 'మన ఊరు- మన బడి' పేరిట, ప్రస్తుతం 'అమ్మ ఆదర్శ పాఠశాలల' పేరుతో బడుల్లో అభివృద్ధి పనులు చేపడుతోంది. ఇంత వరకు బాగానే ఉన్నా బడుల్లో పర్యవేక్షణ చేసే వారు లేక పోవడంతో నిర్వహణ గాడి తప్పుతోంది.

మండల విద్యాధికారులేరి?

- జిల్లాలో ఎంఈవో పోస్టులు ఖాళీ
- గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు అదనపు బాధ్యతలు
- పర్యవేక్షణ లేక గాడి తప్పుతున్న విద్యావ్యవస్థ

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 3: జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క మండ లంలోనూ ఎంఈవోలు లేక పోవడంతో విద్యావ్యవస్థ కుంటు పడు తోంది. విద్యా వ్యవస్థలో జిల్లా స్థాయి పర్యవేక్షణకు డీఈవో, మండల స్థాయిలో పర్యవేక్షణకు ఎంఈఓ ఎంతో ముఖ్యం. ప్రస్తుతం జిల్లాలో 15 మండలాలు ఉండగా ఒక్క రెగ్యులర్ ఎంఈవో లేక పోవడంతో విద్యా వ్యవస్థ దారి తప్పుతుంది.

● నోడల్ అధికారులుగా నియమించినా..

ప్రభుత్వం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను మండల నోడల్ అధికారు లుగా నియమించినా వారికి తమ పాఠశాల బాధ్యతలను చూసుకునేం దుకే సమయం సరిపోవడంలేదు. వీరు తమ క్లస్టర్ పరిధిలోని పాఠశాలల పర్యవేక్షణ కూడా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారంటే ఆత్యాశే. ప్రస్తుతం జిల్లాలో పర్యవేక్షణ కొర వడి కొన్ని పాఠశాలల్లో సిబ్బంది ఆడిందే ఆటగా మారింది. పర్యవేక్షణ పకడ్బందీగా ఉన్న సమ యంలోనే మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలలకు ఉపాధ్యాయులు వెళ్లని సంఘటనలు కోకొల్లలు. ప్రస్తుతం అడిగే వారే లేక పోవడంతో చదువులు దైవాదీనం.. పిల్లల అదృష్టం అన్నట్లుగా మారింది. మరోపక్క ఎంఈవో కార్యాలయాలకు ప్రతి ఏడాది వచ్చే నిధులు ఎక్కడికి పోతున్నాయో తెలియని పరిస్థితి. ఒక్క పైసా కూడా ఖర్చు కావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికంతటికి కారణం ప్రతీ మండ లానికి రెగ్యులర్ ఎంఈవోలు లేకపోవడమే. జిల్లాలో 738 పాఠశాలలు ఉండగా ఇద్దరు ఎంఈవోలే దిక్కయ్యారు. వారు సరైన పర్యవేక్షణ చేయకపోవడంతో పరీక్ష ఫలితాలతో పాటు అభివృద్ధి పనులపై, మధ్యాహ్న భోజనంపై ప్రభావం చూపుతోంది. రెగ్యులర్ ఎంఈఓలు ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని ఇకనైనా ప్రభుత్వం జిల్లాలో విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

● ఏడాదికి రూ. 74వేలు..

ఎంఈవో కార్యాలయానికి యేటా ప్రభుత్వం నుంచి రూ. 74 వేల నిధులు మంజూరు అవుతాయి. వీటితో ఎంఈవో కార్యాలయంలో విద్యుత్ బిల్లులు, కంప్యూటర్ల రిపేర్, ఇంటర్‌నేట్ బిల్లులతో పాటు ఇతర కార్యాలయ ఖర్చుల నిమిత్తం వాడుకోవాలి. కానీ ఈ నిధులను ఎక్కడ కూడా ఇన్‌చార్జి ఎంఈవోలు ఖర్చు చేసినట్లు లెక్కలు కానరావడంలేదు. మరీ ఈ నిధులు ఏమవుతున్నాయనే సందేహాలు వస్తున్నాయి. ప్రతి నెలా ఎంఈవో ఆధ్వర్యంలో నిర్వహించే హెచ్‌ఎంల సమావేశానికి కార్యాలయ ఖర్చులకు సంబంధించిన డబ్బులు ఉపాధ్యాయులే సొంతంగా భరిస్తున్నారు. ఇక విద్యార్థులు అందరికి పుస్తకాలు అందాయా దుస్తులు చేరాయా లేదా పాఠశాలలకు ఉపాధ్యాయులు సమయానుసారంగా వస్తున్నారా లేదా బోధన ఎలా సాగుతోంది అని పర్యవేక్షంచేవారు లేక పోవడంతో జిల్లాలో విద్యా వ్యవస్థ గాడి తప్పుతోంది.

● బదిలీపై వెళ్లినా..

ఎంఈవోలుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న జిల్లాలోని పలువు రు ప్రధానోపాధ్యాయులు గత ఏడాది సెప్టెంబరులో బదిలీల్లో వేరే జిల్లాకు వెళ్లిపోయారు. అలాంటి వారు ఇప్పటికీ పాత జిల్లాలో ఇన్‌చార్జి ఎంఈవోలుగానే కొనసాగుతున్నారు. కుమరంభీం జిల్లా హెచ్‌ఎం భిక్షప తి వరంగల్ జిల్లాకు బదిలీ కాగా అయన ఇప్పటికి కాగజ్‌నగర్, దహె గాం, సిర్పూర్(టి) ఎంఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వెంకటేశ్వరస్వామి మంచిర్యాల జిల్లాకు బదిలీ అయిన్పటికీ ఇప్పటికి రెబ్బెన, తిర్యాణి, ఎంఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఆసిఫాబాద్ ఎంఈవో మనుకుమార్ ఆదిలాబాద్‌కు బదిలీ అయినప్పటికీ ఆసిఫా బాద్, వాంకిడి ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఇతర జిల్లాలకు బదిలీ అయిన హెచ్‌ఎంలను రిలీవ్ చేస్తే ఆసిఫాబాద్ డివిజన్‌లోని జైనూర్‌కు కుడ్మెత సుధాకర్, కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని కౌటాలకు రమేశ్‌బాబు ఇద్దరే ఇన్‌చార్జిలుగా విధుల్లో ఉంటారు.

పెన్‌గంగా వరదను పరిశీలించిన ఎమ్మెల్యే



పెన్‌గంగా వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీ‌ష్‌బాబు

సిర్పూర్(టి), సెప్టెంబరు 3: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల మూలంగా పెన్‌గంగా ఉధృ తంగా సిర్పూర్(టి) మండలం వెంకట్రావుపేట వంతెన పై నుంచి ప్రవహించడంతో మంగళవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీ‌ష్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరిని కూడా వంతెన దాటేందుకు అనుమతివ్వరాదన్నారు. ఇంకా వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. అలాగే పారిగాం, టోంకి, వెంకట్రావుపేట గ్రామాల సమీపంలోని పంట పొలాల్లో బ్యాక్ వాటర్ చేరడంతో వివరాలు తెలుసుకున్నారు. పంట నష్ట పోయిన రైతులకు పరిహారం అందించాలన్నారు. వరద ఉధృతి తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాగా వెంకట్రావుపేట గ్రామంలో జ్వరంతో బాధపడుతూ మృతి చెందిన బాలిక గంగోత్రి కుటుం బీకులను పరామర్శించారు. గ్రామంలో ఎవరైనా జ్వరంతో బాధపడినట్లయితే తక్షణమే ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట నాయకులు శంకర్, అశోక్, నానయ్య, సత్యనారాయణ, సాయి, ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

తగ్గని వరద ఉధృతి



వంతెనపై నుంచి ప్రవహిస్తున్న పెన్‌గంగా

సిర్పూర్(టి), సెప్టెంబరు 3: మండలంలో పెన్‌గంగా వరద ఉధృతి మంగళవారం సైతం తగ్గలేదు. పోడ్సా- వెంకట్రావుపేట, హుడ్కిలి గ్రామ సమీపంలోని పెన్‌గంగా ఉధృతంగా ప్రవ హించడంతో మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలకు రాకపోకలు నిలిచి పోయాయి. వరద ఉధృతిని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్సై కమలాకర్ పరిశీలించారు. వాగువద్ద బందో బస్తు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితులను తెలుసుకుంటున్నారు. అలాగే కాలిన కూడా ఎవరు కూడా వెళ్లకుండా చూస్తున్నారు. లోతట్టు ప్రాంతాలైన పారిగాం, లక్ష్మీపూర్, హుడ్కిలి, జన్కాపూర్‌తో పాటు అప్రమత్తం చేశారు. ఎవరు కూడా వాగుల వైపు వెళ్లకూడదని సూచిస్తున్నారు. మత్స్యకారులు సైతం చేపల వేటకు వెళ్లకూడదని తెలిపారు.

నీట మునిగిన పంటల పరిశీలన

సిర్పూర్(టి), సెప్టెంబరు 3: సిర్పూర్(టి) మండలం టోంకిని, వెంకట్రావుపేట తదితర గ్రామాల్లో పెన్‌గంగా బ్యాక్‌వాటర్‌తో నీట మునిగిన మిర్చి, పత్తి పంటలను మంగళవారం ఏవో మధులత, ఏఈవోలు నేహాతబసుంలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పెన్‌గంగా బ్యాక్‌వాటర్‌తో పంటలు ముంపునకు గురయ్యాయి. దీంతో వందల ఎకరాల్లో పంట నీట మునిగింది. నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

కాగజ్‌నగర్, సెప్టెంబరు 3: కాగజ్‌నగర్ ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏపీవో బుచ్చన్న తెలిపారు. ఏడాది పాటు జరిగిన పనులు, ఖర్చు చేసిన అంశాలపై ఈ ప్రజావేదికలో చర్చజరుగనున్నట్టు తెలిపారు. ఆయాశాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

పేకాట స్థావరంపై దాడి

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 3: ఆసిఫాబాద్ మండలం దస్నాపూర్‌లో పేకాట స్థావరం పై జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు దాడి చేసి పేకాట ఆడుతున్న ముగ్గురిని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. వారి నుంచి రూ.8100 స్వాధీన పర్చుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో ఎస్సై సందీప్‌కుమార్, కానిస్టేబుల్‌లు సంజీవ్, దేవేందర్ పాల్గొన్నారు.

వాంకిడి: వాంకిడి పోలీసు స్టేషన్ పరిధిలోని ఖమాన గ్రామ శివారులో పేకాట స్థావరాలపై ఎస్సై ప్రశాంత్, టాస్క్‌ఫోర్స్ ఎస్సైతో కలిసి దాడులు నిర్వహించారు. ఖమాన గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి రూ.3200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర

వాంకిడి, సెప్టెంబరు 3: మండలంలోని సరండి గ్రామ సమీపంలో శుక్రవారం ఎల్లమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. బోడ గుట్టపైన గల ఎల్లమ్మ తల్లిని దర్శించుకునేందుకు మండలం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. యేటా పొలాల అమవాస్య మరుసటి రోజున ఇక్కడ జాతర కొనసాగుతుంది. భక్తులు కిలోమీటరు గుట్టపైన గల ఎల్లమ్మ ఆలయం వద్దకు వెళ్లి మొక్కులు చెల్లించు కుంటున్నారు. జాతర వద్ద ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వాంకిడి, సెప్టెంబరు 3: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెచ్‌ఈవో రవిదాస్ అన్నారు. మంగళవారం మండలంలోని ఇందాని గ్రామపంచాయతీ పరిధిలోని చించోలి గ్రామంలో డ్రై డే నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ట్యాంకులు తదితర వాటిలో నిలువ ఉన్న నీటిని తొలగించారు. ఈ సందర్భంగా పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఏఎన్‌ఎం కాంత, ఆశా వర్కర్ కమల తదితరులు ఉన్నారు.

చెరువు నీరు కలుషితం కాకుండా చూడాలి

బెజ్జూరు, సెప్టెంబరు 3: బెజ్జూరు మండల కేంద్రంలో చిన్నవాగు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని మంగళవారం మండల కేంద్రంలోని పలువురు యువకులు కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కొంత మంది వ్యక్తులు చెత్తను, ప్లాస్టిక్ ప్లేట్స్, గ్లాసులు, కవరులు డంపింగ్ యార్డ్‌లో కాకుండా చిన్నవాగు బ్రిడ్జి పై నుంచి వాగులో పడేస్తుండడంతో కలుషితమవుతుంద న్నారు. దీంతో చెలిమల ద్వారా నీరు నింపుకుని తాగేవారు, దుసులు ఉతికే వారు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

చట్టాలపై విద్యార్థినులకు అవగాహన

పెంచికలపేట, సెప్టెంబరు 3: పెంచికలపేట మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు చట్టాలపై షీ టీం, భరోసా టీం సభ్యులు అవగాహన కల్పించారు. భరోసా టీం ఇన్‌చార్జి మహిళా ఎస్సై తిరుమల మాట్లాడుతూ బాలబాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టం, శిక్షలు, బాల్య వివాహ నిరోధక చట్టం గురించి అవగాహన కల్పించారు. అలాగే అత్యాచార బాధితులు భరోసా సెంటర్‌ను ఎలా ఆశ్రయించవచ్చు, భరోసా సెంటర్‌లో లభించే సదుపాయాలు,సేవలు వివరించారు. మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలకు ఎవరైనా గురైనట్లయితే వెంటనే షీ టీంను సంప్రదించాలన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100, అలాగే భరోసా సెంటర్ 8712670561, కాగజ్‌నగర్ షీ టీం 8712670565, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098ను సంప్రదిం చాలని సూచించారు. కార్యక్రమంలో రమాదేవి, సునీత, ప్రధానోపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

- జాతీయ షెడ్యూల్డ్‌కులాల కమిషన్ సభ్యుడు రాంచందర్



మాట్లాడుతున్న జాతీయ షెడ్యూల్డ్‌కులాల కమిషన్ సభ్యుడు రాంచందర్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 3: ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల కోసం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల ఫలాలను అర్హులైన వారికి సత్వరమే అందించేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలో మంగళవారం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. ఆర్టికల్ 338 ప్రకారం రాజ్యాంగ బద్ధమైన కమిషన్ ద్వారా షెడ్యూల్డ్ కులాల కుటుంబాల సంక్షేమం కోసం పని చేస్తుందన్నారు. వివిధ పథకాలలో జనాభా దామాషా ప్రకారం సంక్షేమ ఫలాలు అందించి వారి అభివృద్ధికి అధికారులు పని చేయాలన్నారు. అట్రాసిటీ కేసులలో పోలీసు అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని చెప్పారు. పరిశ్రమల శాఖ పరిధిలో అర్హులైన షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువతకు ప్రోత్సాహకం అందించాలని, చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తోడ్పడాలని తెలిపారు. లబ్ధిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీని పూర్తి స్థాయిలో అందే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువత కోసం ఉద్యోగాలలో ఖాళీగా ఉన్న పోస్టులను బ్యాక్‌లాగ్ కింద భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే షెడ్యూల్డ్ కులాల వారి కోసం స్థానికంగానే శిక్షణ కేంద్రాలు, స్టడీ సెంటర్లు ఏర్పాటు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. విదేశీ విద్యను అభ్యసించే విద్యార్థుల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల కుటుంబాలలో 2,424 మంది లబ్దిదారులకు 5,880 ఎకరాల భూమిని వివిధ దశలలో లావుణి పట్టాలు జారీ చేశామని చెప్పారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో 2020 నుంచి 2023 వరకు 76 కేసులు నమోదు కాగా వాటిపై విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందేలా చూస్తున్నట్లు అధికారులు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ జిల్లా అధికారుల సమన్వయంతో షెడ్యూల్డ్ కులాల కుటుంబాల వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు సకాలంలో అందించడంతో పాటు బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా జాతీయ కమిషన్ సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివసరావు, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, జిల్లా అటవీ శాఖాధికారి నీరజ్‌కుమార్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీ‌ష్‌బాబు, రీసెర్చ్ సభ్యులు వరప్రసాద్, ఏఎస్పీ ప్రభాకర్‌రావు, ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేష్, డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా జాతీయ షెడ్యూల్డ్‌కులాల కమిషన్ సభ్యులు వడ్డెపల్లి రాంచందర్‌ను జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు, కేవీపీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతి పత్రాలు అంద జేశారు. జిల్లాలో 30 ఏళ్లుగా సాగు చేస్తున్న దళితులకు పట్టాలు ఇవ్వాలని, గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులు కేశవరావు,అశోక్, గోపాల్‌రావు, బీజేపీ నాయకుడు మల్లికార్జున్, కె.విజయ, విశాల్, జయరాజు, కేవీపీఎస్ నాయకులు దినకర్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలో బుద్ధ విహార్ నిర్మాణానికి నిదులు మంజూరు చేయాలని మంగళవారం జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు వడ్డెపల్లి రాంచందర్‌కు వాంకిడి అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్, యువజన సంఘం నాయకులు విలాస్, విజయ్, శ్యాంరావు, సందీప్,ప్రతాప్, ప్రశాంత్, ప్రదీప్, మారుతి, గంగుబాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



వర్ష ప్రభావంతో తగ్గిన బొగ్గు ఉత్పత్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, సెప్టెంబరు 3: శ్రీరాంపూర్ ఏరియాలో వర్ష ప్రభావంతో పాటు కొత్త మిషన్లను గనుల్లోకి దింపడంలో ఆలస్యం కావడం వల్ల ఆగస్టు నెల బొగ్గు ఉత్పత్తి తగ్గిందని ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్ అన్నారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూగర్భ గనుల్లో ఉత్పత్తి యధావిధిగా కొనసాగినా ఓసీపీలు పనిచేయలేదన్నారు. ఈ కారణంగా మొత్తం ఉత్పత్తి లక్ష్యం 4లక్షల 54 వేల 900 టన్నులు కాగా, కేవలం 2 లక్షల 68 వేల 817 టన్నుల బొగ్గును వెలికి తీశామన్నారు. చివరకు 59శాతం మాత్రమే ఉత్పత్తిని సాధించామన్నారు. భూగర్భ గనుల్లో ఆర్‌కే-5 గని 87శాతం, ఆర్‌కే-6 గని 103 శాతం, ఆర్‌కే-7 గని 71శాతం, ఆర్‌కే-న్యూటెక్ గని 107శాతం, ఎస్ఆర్‌పీ-1 గని 76శాతం, ఎస్ఆర్‌పీ-3 గని 92శాతం, ఐకే-1ఏ గని 71 శాతం, ఇందారం ఓసీపీ 39 శాతం, శ్రీరాంపూర్ ఓసీపీ 48శాతం ఉత్పత్తిని నమోదు చేసినట్లు చెప్పారు. ఉత్పత్తి చేసిన బొగ్గును రైలు మార్గం ద్వారా 3 లక్షల 16 వేల 331 టన్నులు, రోడ్డు మార్గం ద్వారా 26 వేల 734 టన్నులు మొత్తం 3 లక్షల 43 వేల 66 టన్నులను రవాణా చేసినట్లు వివరించారు.

రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 3: నిర్దేశిత 72 మిలియన్ టన్నులను చేరుకోవాలంటే ఈ నెలలో ఇక నుంచి రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి సీఎండీ ఎన్. బలరాం ఆదేశించారు. మంగళవారం ఆయన అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డైరెక్టర్లు డి సత్యనారాయణ, ఎన్.వీ.కే. శ్రీనివాస్, జి వెంకటేశ్వర్ రెడ్డి, జీఎం(కో-ఆర్డినేషన్) సుభాని, జీఎం(సీపీపీ) రమేష్, జీఎం (మార్కెటింగ్) రవి ప్రసాద్, వివిధ ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.

క్వార్టర్ల కోసం కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, సెప్టెంబరు 3 : శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న అధికారులకు మంగళవారం క్వార్టర్ల కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో 29 క్వార్టర్లకు నాలుగు క్వార్టర్లు తీసుకున్నారు. కౌన్సెలింగ్‌లో ఎస్ఓ టు జీఎం ఎన్. సత్యనారాయణ, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, డీజీఎం(పర్సనల్) పి. అరవిందరావు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్, డీవైపీఎం దేవేందర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ఐఎన్టీయూసీ లక్ష్యం

- ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య



అధికారులకు పత్రం అందజేస్తున్న నాయకులు

మందమర్రి టౌన్, సెప్టెంబరు 3: సింగరేణిలో కార్మిక సమస్యల పరిష్కారమే ఐఎన్టీయూసీ లక్ష్యమని ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య తెలిపారు. ఎస్అండ్‌పీసీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఏరియాలో అన్ని గనుల, డిపార్టుమెంట్లకు సంబంధించి కమిటీల నియామకం చేపట్టామని తెలిపారు. కార్మికుల ప్రధాన సమస్యలను తెలుసుకొని తమ కార్యాలయంలో చర్చించనున్నామని తెలిపారు. అధికారులకు లేఖలు కూడా ఇచ్చామన్నారు. ఇందులో భాగంగా కార్మికులకు ఎలాంటి సమస్యలు ఉన్నా కార్యాలయంలో కలిస్తే పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. కాగా మందమర్రి ఏరియా ఎస్అండ్‌పీసీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పిట్ కార్యదర్శిగా చంద్రశేఖర్, పిట్ సెక్రెటరీగా ఏఆర్ సంపత్, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీగా చంద్రగిరి మొగిలి, షిఫ్టుల ఇన్‌చార్జిలుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీ పత్రాన్ని ఎస్అండ్‌పీసీ అధికారి రవికి అందజేశారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 3: ఈ నెల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్ అన్నారు. జీఎం కార్యాలయంలో మంగళవారం ఆయన ఏరియా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం ఎన్. సత్యనారాయణ, ఏజెంట్లు గోపాల్ సింగ్, రాముడు, శ్రీధర్, ఇందారం ఓసీపీ పీఓ ఏవీ రెడ్డి, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఆనంద్ కుమార్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏరియా రక్షణాధికారి శ్రీధర్, డిప్యూటీ సీఎంఓ రమేష్ బాబు, క్వాలిటీ మేనేజర్ కె. వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పదవీ విరమణ అధికారికి సన్మానం

జైపూర్, సెప్టెంబరు 3: ఎస్టీపీపీలో అడిషనల్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న రమణ పదవీ విరమణ పొందగా మంగళవారం ఎస్టీపీపీ అధికారులు, ఉద్యోగులు మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు, అధికారులు కె. శ్రీనివాసులు,జేఎన్ సింగ్,ప్రసాద్, సుధాకర్, సముద్రాల శ్రీనివాస్,ప్రభాకర్, ఠాకూర్ మోహన్‌సింగ్ పాల్గొన్నారు.

ఆర్‌కే-7 మైనింగ్ స్టాఫ్ పిట్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్, సెప్టెంబరు 3: శ్రీరాంపూర్‌లోని ఆర్‌కే-7 మైనింగ్ స్టాఫ్ పిట్ కమిటీని మంగళవారం గని ఆవరణలో ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా ఏఐటీ యూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, జీఎం చర్చల ప్రతినిధి ఉప్పరి చంద్రశేఖర్ హాజరయ్యారు. కార్య దర్శిగా కుమారస్వామి, సహాయ కార్యదర్శిగా పవన్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా రంజిత్, రిలే ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా రాజేశం, విజయ్ కిరణ్, ప్రశాంత్, రామ స్వామి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి బీర రవీందర్, బెల్లంపల్లి రీజియన్ మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ అసిస్టెంట్ కార్యదర్శి విజయ్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, కార్యదర్శి మారపెల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కలను నెరవేర్చాలి

- ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య

మందమర్రి టౌన్, సెప్టెంబరు 3: సింగరేణిలో కార్మికుల సొంతింటి కలను నెరవేర్చే దిశగా చొరవ చూపాలని ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య తెలిపారు. స్థానికంగా మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మూడు రోజుల క్రితం గోదావరిఖని పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ వివరిం చారన్నారు. లాభాల వాటా ప్రకటించే విధంగా ముఖ్యమంత్రితో మాట్లాడి చర్యలు చేపట్టాలన్నారు. కార్మికులు ఉద్యోగ విరమణ పొందిన తర్వాత 15 రోజుల్లో క్వార్టర్ ఖాళీ చేస్తేనే గ్రాట్యుటీ డబ్బులు ఇస్తున్నారని, దీంతో కార్మికులు రోడ్డున పడే పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. సింగరేణి క్వార్టర్లను కార్మికులకు శాశ్వతంగా ఇచ్చేలా చూడాలని అన్నారు. పెండింగ్ సమస్యలకు సంబంధించి జనక్ ప్రసాద్ నివేదిక తయారు చేశారని, త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి, మంత్రి శ్రీధర్‌బాబు, కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలతో కలిసి చర్చించాలని కోరుతున్నారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

అవుట్ మస్టర్‌ను 3 గంటలకే నమోదు చేయాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 3: అవుట్ మస్టర్‌ను 3 గంటలకే నమోదు చేయాలని హెచ్ ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాపును సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. వర్క్‌షాప్‌లో క్యాంటీన్, మహిళా ఉద్యోగులకు రెస్ట్‌హాల్ ఏర్పాటు చేయాలని, ఈపీఆర్‌లో తప్పులను వర్క్‌షాప్‌లోనే సవరించాలని, అవుట్ డోర్‌కువెళ్లే ఉద్యోగులకు కూడా వుట్ మస్టర్ నమోదు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యలను ఆయన డీజీఎం రవీందర్ దృష్టికి తీసుకుపోగా, మహిళలకు తాత్కాలికంగా రెస్ట్ హాల్ ఏర్పాటు చేస్తామని, రెండు నెలల్లో శాశ్వత ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి. అనిల్ రెడ్డి, పిట్ కార్యదర్శి పొన్నగంటి అశోక్, నాయకులు దుర్గం లక్ష్మణ్, చెవుల శ్రీనివాస్, అరెల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల ఆందోళన

జైపూర్, సెప్టెంబరు 3: శ్రీరాంపూర్ ఏరియలోని ఇందారం ఓపెన్‌కాస్టులో ఓబీ పనులు నిర్వహిస్తున్న వరహా కంపెనీ యాజమాన్యం మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని పేర్కొంటూ మంగళవారం ఓసీపీ పీవో కార్యాలయం ముందు కాంట్రాక్టు కార్మికులు ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి వరహా కంపెనీ యాజమాన్యాన్ని జీతాలు ఇవ్వాలని విన్నవించినప్పటికీ ఇవ్వడం లేదని వాపోయారు. మా కుటుంబాలను ఎలా పోషించుకోవాలో సింగరేణి అధికారులు చెప్పాలన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌వో సతీష్ కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడారు. రెండు రోజుల్లో వేతనాలు ఇప్పించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు.